సాక్షి విజయనగరం

సోమవారం । 17 । జూలై । 2023



ఆధిపత్యం కోసం హత్య

ఉద్దవోలు గ్రామానికి చెందిన ఏగిరెడ్డి కృష్ణను ప్రత్యర్థులు వ్యక్తిగత కక్షలు, గ్రామంలో ఆధిపత్యం కోసం హతమార్చినట్లు ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. - 8లో



టెలి మెడిసిన్ సేవలు భళా..!

ఆస్పత్రికి రాకుండానే రోగి ఉన్న గ్రామం నుంచే స్పెషలిస్టు వైద్యుల సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన టెలిమెడిసిన్ హబ్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. - 8లో



ముగిసిన పవర్‌లిఫ్టింగ్ పోటీలు

గడిచిన ఐదు రోజులుగా స్థానిక జీఎంఆర్ స్పోర్ట్స్ అరేనాలో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్స్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. - 8లో

న్యూస్‌రీల్

అంబులెన్సులను అప్రమత్తంగా నడపాలి

- 104, 108 అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఫ్లీట్ మేనేజర్ జగ్గురాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగ్గురాజు

విజయనగరం ఫోర్ట్: 104, 108 అంబులెన్సులను, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అత్యంత అప్రమత్తంగా నడపాలని ఆ వాహనాల అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఫ్లీట్ మేనేజర్ జగ్గురాజు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయా వాహనాల డ్రైవర్లు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లకు ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల సామర్థ్యాన్ని ప్రతి రోజు పరిశీలించాలని సూచించారు. వాహనాల నిర్వాహణకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. 108 అంబులెన్సు ద్వారా రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడాలన్నారు. 104 వాహనాలను గ్రామాలకు నిర్దేశిత సమయానికి చేర్చాలని చెప్పారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వారిని సురక్షితంగా చేర్చాలన్నారు. శిక్షణలో 108 జిల్లా మేనేజర్ ఎస్.మన్మధనాయుడు, 104 జిల్లా మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముఖ, సంతోష్‌కుమార్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బికెవి.ప్రసాదరావు అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్త కొరతను తీర్చడానికి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన పెరగాలన్నారు. మనిషి మాత్రమే రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడని, దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగు పర్యాయాలు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు పాల్గొన్నారు.


కోసలి సమీపంలో ఏనుగుల హల్‌చల్



ఐలమ్మ తోట నుండి పంట పొలాల్లోకి వస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని కోసలి సమీపంలో నాలుగు ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. ఆదివారం తాలాడ ఐలమ్మ తోట నుంచి బయటకు వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాల్లో షికార్లు కొట్టాయి. తోటలోని పండ్ల సీజన్ ముగియడంతో తోట బయటకు వచ్చి పంట చేలపై పడ్డాయి. మొక్కజొన్న, చెరకు, కర్బూజ ఇతర కూరగాయల పంటల కోతలు పూర్తవడంతో ఏనుగుల గుంపు ఆహారం కోసం పచార్లు కొట్టాయి. ఇదే సమయంలో నాట్లు వేసిన పంట పొలాలను పాడు చేశాయని కోసలి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం




ఎల్విన్‌పేటలో కురుస్తున్న భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు కురిసిన వర్షంతో పొలాల్లో నీరు పుష్కలంగా చేరింది. రహదారులన్నీ జలమయం కావటంతో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే వరి విత్తనాలు వేయడంతో పెరిగిన నారుకు.. అలాగే దుక్కిలు చేపట్టేందుకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేనున్నానంటూ..



రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్ సర్కార్ పాలన సాగుతోంది. అన్నదాత ఆనందంగా సాగు చేసుకుంటున్నాడు. కౌలు రైతులు కూడా హాయిగా సాగుకు సిద్ధమవుతున్నారు. కౌలు రైతులకు సైతం రైతుభరోసా వంటి పథకాలను అమలు చేస్తూ అందరి మన్ననలు పొందుతూ జగన్‌మోహన్‌రెడ్డి శభాష్ అనిపించుకుంటున్నారు.



- కౌలు రైతుకు వెన్నుదన్ను
- 2020 నుంచి 2022 వరకు 25,665 మందికి సీసీఆర్‌సీ కార్డులు
- వీరిలో 8832 మందికి రైతు భరోసా కింద రూ.12 కోట్ల అందజేత
- ఈ ఏడాది ఇప్పటి వరకు 6479 మంది కౌలు రైతులకు కార్డుల జారీ
- భూ యాజమాని హక్కులకు ఇబ్బంది కలగకుండా సీసీఆర్‌సీ కార్డుల అందజేత

విజయనగరం ఫోర్ట్:

రైతులతో పాటు కౌలు రైతులకు కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తోంది. రైతుల సంక్షేమం కోసం ఎటువంటి సంక్షేమ పథకాలు అందిస్తుందో కౌలు రైతులకూ అవే సంక్షేమ పథకాలను అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం రైతులను, కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, కొందరికి మాత్రమే చేసి చేతులు దులిపేసుకుంది. కౌలు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక రైతుల సంక్షేమానికి పాటు పడుతోంది. రైతులకు వెన్నుదన్నుగా నిలిచి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోంది. ముఖ్యంగా భూయాజమానుల దగ్గర భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న నిరుపేద రైతులకు దేశంలో ఎక్కడ లేని విధంగా పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ) ఇచ్చి వారికి అండగా నిలిచింది. కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సాగు పెట్టుబడికి ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలను భూయాజమానులకు ఇబ్బంది కల్గకుండా ప్రభుత్వం అందిస్తోంది. గడిచిన మూడేళ్లలో వేలాది మంది కౌలు రైతులకు లబ్ధి చేకూర్చింది.

25,665 మందికి సీసీఆర్‌సీ కార్డులు

పంట సాగు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్‌సీ) 2020 నుంచి 2022 వరకు జిల్లాలో 25,665 మందికి ప్రభుత్వం అందించింది. వీరిలో 8,832 మంది కౌలు రైతులకు రూ. 12.05 కోట్లు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది. 1753 మంది రైతులకు రూ.8.74 కోట్లు పంట రుణాలు మంజూరు చేసింది. 2023 సంవత్సరానికి సంబంధించి 5699 కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటివరకు 6,479 మందికి కార్డులు ఇచ్చారు. వీరిలో 5 వేల మందికి పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

2020 నుంచి ప్రభుత్వం అందించిన సీసీఆర్‌సీ కార్డుల వివరాలు

సంవత్సరం	సీసీఆర్‌సీ కార్డులు	రైతు భరోసా పొందిన రైతులు	నిధులు
2020	10,447	3202	రూ. 4.32కోట్లు
2021	9522	3672	రూ.4.85 కోట్లు
2022	5696	2058	రూ.2.77 కోట్లు

సీసీఆర్‌సీతో బహుళ ప్రయోజనాలు

పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్‌సీ) వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు పొందవచ్చు. పంట రుణాలు పొందవచ్చు. అదే విధంగా పండించిన పంటను విక్రయించుకోవచ్చు. ముఖ్యంగా రైతులకు అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కింద అందిస్తున్న ఆర్థిక సాయం పొందవచ్చు. దేశంలో ఎక్కడ లేనివిధంగా మన రాష్ట్రంలోనే ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసాను వర్తింపు జేస్తుంది.



విజయనగరం మండలం పినవేమలిలో వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతు

రెండేళ్లుగా రైతు భరోసా



నేను రెండెకరాలు కౌలుకు తీసుకుని 2021 నుంచి భూమిని సాగు చేస్తున్నాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏటా వైఎస్సార్ రైతు భరోసా నగదును నా ఖాతాలో జమ చేస్తోంది. నాలాంటి కౌలు రైతులకు ఇది చాలా ప్రయోజనకరం. ఆయనకు రుణపడి ఉంటా...

– సిరపురపు రామునాయుడు, రైతు, పెదవేమలి గ్రామం

ఇప్పటికే పత్రాలు మంజూరు చేస్తున్నాం...



పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు జారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించాం. ఇప్పటి వరకు 6,479 మందికి అందజేశాం. వీరిలో నాలుగు వేల మందికి వ్యక్తిగత పంట రుణాలు, 1000 మందికి గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం ఆయా బ్యాంకులకు కౌలు రైతుల వివరాలను అందజేశాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయాధికారి

భూ హక్కుల కల్పనపై హర్షం

నెల్లిమర్ల రూరల్: ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలకు భూహక్కులు కల్పించడంపై టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు రేగాన శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం విస్మరించిందని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నుంచి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. రెతులు సాగు చేస్తున్న భూములపై వారికి భూ హక్కు కల్పిస్తుండడంతో అన్నదాతలు ఆనందిస్తున్నారన్నారు. సీఎం జగన్ హయాంలోనే సంక్షేమం సాధ్యమని, అన్ని వర్గాల ప్రజలు ఆయనకు మద్దతు పలకాలని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయనను సీఎంగా మరోసారి గెలిపించుకోవాలని కోరారు.

తిప్పలవలసలో ముందుకొచ్చిన సముద్రం



సురక్షిత ప్రాంతానికి తరలించిన పడవలు, వలలు

పూసపాటిరేగ : మండలంలోని తిప్పలవలస సముద్ర తీరంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో సముద్రం 15 అడుగులు ముందుకు వచ్చింది. ఉవ్వెత్తిన లేచిన కెరటాలు ఉధృతితో సముద్రం ముందుకు వచ్చింది. హఠాత్తుగా సము ద్ర కెరటాలు ముందుకు రావడంతో తేరుకున్న మత్స్యకారులు తీరం అంచున ఉన్న పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సముద్రంలో వాతావరణంలో తేడా కారణంగా కెరటాలు ముందుకు వచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు.

హెచ్ఎంల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విజయనగరం పూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం విజయనగరం జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక పోర్ట్ సిటీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు అధ్యక్షతన సంఘం ఎన్నిక జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికల పరిశీలకులుగా వి.సత్యనారాయణ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడుగా ఎం.వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి.సన్యాసిరాజు, కోశాధికారిగా బి.సాయిచక్రధర్, గౌరవ అధ్యక్షుడిగా కె.సత్యంతో పాటు రాష్ట్ర కౌన్సిలర్లు శ్రీనివాస్, రాధాకృష్ణ, అంబల్ల కృష్ణారావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్స్ (డిజిటల్ ఆపరేటర్స్) నియామకం జరగాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా మంజూరు కాని స్కూల్ గ్రాంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. నూతనంగా నియామకం కాబడిన ఎంఈవో 2 జీత భత్యాలు, నూతనంగా అప్‌గ్రేడ్ కాబడిన ఉన్నత పాఠశాలల డీడీవో కోడ్స్‌ను క్రియేట్ చేసి ఆయా పాఠశాలల జీతభత్యాలు మంజూరయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన డిప్యూటీ ఈవో పదోన్నతులు తక్షణమే చేపట్టాలని కోరారు. అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. హెచ్ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి

- విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్యాడెట్ విభాగం తైక్వాండో పోటీలు ఆదివారంతో ముగిశాయి. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా రాజీవ్ క్రీడా ప్రాంగణం వేదికగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి తరం యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ పాటవాలు కనబరచాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీవీ చారిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై... జరభద్రం



వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటి బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు పాటిస్తే మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని పేర్కొంటున్నారు.

- మొదలైన వ్యాధుల వ్యాప్తి
- 1.04 లక్షల మంది జ్వర పీడితులు
- 194 డెంగీ కేసులు
- 91 మలేరియా కేసులు
- పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

విజయనగరం ఫోర్ట్:

వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా వర్షపు నీరు దిగువ ప్రాంతాలలో నిల్వ ఉంటుంది. నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వృద్ధి పెరిగింది. సీజనల్ వ్యాధుల వ్యాప్తి కూడా మొదలైంది. వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో వేలాది మంది ఇప్పటికే జ్వరాల బారిన పడ్డారు. అదే విధంగా డెంగీ కేసులు కూడా అధికంగా నమోదు అయ్యాయి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

సాధారణ జ్వరం, జలుబు



సీజన్ మార్పుతో వాతావరణంలో వచ్చే సూక్ష్మక్రిముల వల్ల వచ్చే జ్వరాన్ని వైరల్ జ్వరం అంటారు. అవి గాలి, నీటి ద్వారా వ్యాపిస్తాయి. సాధారణ జ్వరం వైరస్ రకాన్ని బట్టి ఉంటుంది. జ్వరం మాత్రమే ఉన్నప్పటికీ, కొంత మందికి దగ్గు, కీళ్ల నొప్పులు కూడా సాధారణ జ్వరంతో ఉంటాయి. ఇవిడెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు కావు. వైరల్ జ్వరం 3 రోజుల నుంచి ఏడు రోజుల వరకు ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరుచుకోవాలి. నిలువ పదార్థాలు తినకూడదు. తాజా పండ్లు తినాలి. వర్షంలో తడవకూడదు. తడిచిన బట్టలలో ఎక్కువ సేపు ఉండకూడదు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఉండకూడదు. మాస్క్ తప్పనిసరిగా ధరించాలి

చికెన్ గున్యా

చికెన్‌గున్యా తీవ్ర జ్వర ప్రభావం చూపుతుంది. ఇది దోమ కాటు వల్ల వస్తుంది. అధిక జ్వరం, కీళ్ల నొప్పులు చికెన్‌గున్యా లక్షణాలు. చికెన్ గున్యా సోకితే మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది.

జాగ్రత్తలు

ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. కూలర్లు, టైర్లు, మొదలైన వాటిలో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. శరీరం మొత్తం కప్పే విధంగా ఉన్న దుస్తులు ధరించాలి.

మలేరియా



తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా వ్యాధి లక్షణాలు. మలేరియా జ్వరం తగ్గిన తర్వాత కూడా మళ్లీ వస్తుంది. జ్వరం తగ్గిపోయిన తర్వాత మళ్లీ వచ్చినట్టయితే మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. మలేరియా ఆడ అనాఫిలస్ దోమ కాటు కారణంగా వ్యాప్తి చెందుతుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా జెర్మ్స్ శరీరంలో లోపలకి వెళ్తాయి. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మలేరియా నివారించడానికి దోమ తెరలు వినియోగించుకోవాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు పేరుకుపోతే అందులో కిరోసిన్‌గాని పురుగు మందుగాని కలపాలి.

జిల్లాలో 1.04 లక్షల జ్వర పీడితులు

జిల్లాలో జనవరి నెల నుంచి జూలై 13వ తేదీ నాటికి 1.04 లక్షల మంది జ్వరపీడితులు నమోదయ్యారు. 1938 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా 194 డెంగీ కేసులు నమోదయ్యాయి. 1,00,993 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 91 మలేరియా కేసులు నమోదయ్యాయి.

డెంగీ లక్షణాలు

వైరల్ జ్వరం మాదిరి తీవ్రంగా ఆకస్మాత్తుగా జ్వరం వచ్చేస్తుంది. తలనొప్పి ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో ఎముకల విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం కలగడం వల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్టు చిన్నచిన్న మొటిముల కనిపిస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా ఉంటుంది. ఈడిస్ ఈజిప్ట అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ పగటి పూట కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దర్లు కనిపిస్తాయి. ఇళ్లలోని కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లోనూ, ఎయిర్ కూలర్లు, ఇళ్ల పరిసరాల్లో నిర్లక్ష్యంగా పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులు, పగిలిన సీసాలు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షపు నీటిలో గుడ్లు పెట్టి ఈ దోమ పెరుగుతుంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఇంటి పరిసర ప్రాంతాల్లో వృధా నీటిని నిల్వ ఉంచరాదు. పెంట కుప్పులు, ఇంట్లో వచ్చే చెత్త చెదారం ఇంటికి దూరంగా వేయాలి. ఇళ్లలో ఉన్న అన్ని గదుల్లో దోమల మందు చల్లించుకోవాలి. దోమ తెరలు వాడడం లేదా ఇంటి కిటికీల తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. నీరు నిల్వ చేసే పాత్రలను ప్రతి వారానాకి ఒకసారి ఖాళీ చేసి మళ్లీ నింపుకోవాలి. ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, పూల కుండీల్లో నీటిని తరుచూ మార్చాలి. నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి. క్రమంగా శుభ్రం చేసుకోవాలి. దోమ కాటు నుంచి రక్షణ కొరకు శరీరం అంతా కప్పి ఉంచుకునే విధంగా దుస్తులు వేసుకోవాలి. ముఖ్యంగా పిల్లలను బట్టలు లేకుండా బయట తిరగనీయరాదు. కుళాయి దగ్గర నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో గల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.



డెంగీ వ్యాధిని వ్యాప్తి చేసే దోమ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం..



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నాం. జ్వర పీడితులకు అక్కడికక్కడే వైద్య పరీక్షలు చేస్తున్నాం. డెంగీ, మలేరియా నిర్ధారణ అయితే వారికి సమీపంలో ఆస్పత్రిలో చికిత్స అందించేలా వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెప్పాం. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ఆటోను ఢీకొట్టిన టిప్పర్

• ఆరుగురికి గాయాలు

గంట్యాడ: మండలంలోని రామవరం వద్ద ప్రయాణికుల ఆటోను టిప్పర్ ఢీకొనడంతో ఆరుగురు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామానికి ఆరుగురు వ్యక్తులు ఒడిశా రాష్ట్రంలోని రాయగం వెళ్లేందుకు శనివారం రాత్రి 11గంటలసమయంలో ఆటోలో బయలుదేరి వెళ్తుండగా రామవరం పెట్రోల్ బంక్ వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయాల పాలయ్యారు. వెంటనే క్షతగాత్రులను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఆటో డ్రైవర్ సైలాడ రమణ పరిస్థితి రమణ పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పరారైన నిందితుడిని పట్టుకున్న ఆర్‌పీఎఫ్



నిందితుడు రాణాను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

విజయనగరం క్రైమ్: హత్య కేసులో పరారైన నిందితుడ్ని విజయనగరం ఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని బలంగీర్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడు మిలాన్ రాణా ఒడిశా నుంచి నుంచి పరారై టాటా యశ్వంత్ పూర్ రైలు ఎక్కేశాడు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన పోలీసులు వెంటనే విశాఖ ఆర్‌పీఎఫ్ కమిషనర్‌కు ఫోన్‌చేశారు. అక్కడి నుంచి విజయనగరం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కు సమాచారం వచ్చింది. ఈ సమాచారం మేరకు అప్రమత్తమైన ఆర్‌పీఎఫ్ సిబ్బంది యశ్వంత్‌పూర్ రైలు విజయనగరం స్టేషన్‌కు చేరుకున్న సమయంలో తనిఖీలు నిర్వహించి ఎస్–2 కోచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు రాణాను పట్టుకుని, అరెస్టు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ అఖిలేష్ కుమార్ సమక్షంలో బలంగీర్ పోలీసులకు అప్పగించారు.

విద్యుత్ షాక్‌తో ఆవుల మృతి



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఒక ఆవు

కొమరాడ: మండలంలోని జంఝావతి కుడి కాలువ పనులు డంగభద్ర సమీపంలో విద్యుత్ షాక్ తగిలి రెండు ఆవులు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో కాలువల్లో మట్టిని సుమారు 50 అడుగుల వరకు ఎత్తుగా పోయడంతో విక్రంపురం నుంచి డంగభద్ర వైపు వెళ్లే విద్యుత్ తీగలు తగిలి విక్రంపురం గ్రామానికి చెందిన పుర్రి పకీరు, పుర్రి బాబురావులకు చెందిన ఆవులు మేతకు వెళ్లి విద్యుత్ తీగలు తగలి మృతి చెందాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే మూగజీవాలు మృతి చెందాయని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి ధ్వజమెత్తారు. కాలువ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కాలువపై విద్యుత్ తీగలు వద్ద మట్టి దిమ్మలు తొలగించాలని డిమాండ్ చేశారు.

రక్తదాతలు.. స్ఫూర్తి ప్రదాతలు

నెల్లిమర్ల రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్, మద్దిల కల్యాణ్ రక్తదానం చేస్తూ, స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తాము న్నామని ముందుకు వచ్చి, ఆదుకుంటున్నారు.ఈ నేపథ్యంలో వారి సేవలను అందరూ అభినందిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో వారు రక్తదానం చేశా రు. దీంతో దుర్గాప్రసాద్ 59వ సారి, కల్యాణ్ 21వ సారి రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు.

ఆధిపత్యం కోసం హత్య

• నలుగురు నిందితుల అరెస్ట్
• ఎస్పీ ఎం.దీపిక



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఎం.దీపిక (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ఏగిరెడ్డి కృష్ణను అదే గ్రామానికి చెందిన మరడాన వెంకటనాయుడు కుటుంబం వ్యక్తిగత కక్షలు, గ్రామంలో ఆధిపత్యం కోసం హతమార్చినట్లు ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. ఈ హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఏగిరెడ్డి కృష్ణ గ్రామంలో క్రియాశీలకంగా వ్యవహరించేవాడు. కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన మరడాన వెంకట నాయుడు కుటుంబంతో ఏగిరెడ్డి కృష్ణకు గొడవలున్నాయి. గ్రామంలో కొన్ని భవనాలు నిర్మించేందుకు నిందితుడు మరడాన వెంకట నాయుడు కాంట్రాక్ట్ పనులు చేయగా, బిల్లులు మంజూరు కాకుండా ఏగిరెడ్డి కృష్ణ అడ్డుపడడంతో, మరడాన వెంకట నాయుడు సుమారు రూ.2 కోట్లను నష్టపోయి, అప్పులపాలై, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తనను ఆర్థికంగా నష్టపరిచిన కృష్ణను హతమారిస్తే కక్ష తీరడంతో పాటూ గ్రామంలో ఆధిపత్యం సాధించవచ్చని నిందితుడు వెంకటనాయుడు కుటుంబం భావించింది. ఈ నేపథ్యంలో జూలై 15న ఉదయం కృష్ణ ఇంటివద్ద వెంకటనాయుడు మాటువేసి, రాజాంలో కృష్ణ బైక్‌పై బయలుదేరిన సమాచారాన్ని సోదరుడు మోహన రావుకు అందించాడు. ఈ క్రమంలో మరడాన మోహనరావు (ఎ1), రెడ్డి రాము (ఏ2) బొలెరో వాహనంపై బయల్దేరి బైక్‌పై వెళ్తున్న కృష్ణను వెంబడించారు. రాజాం మండలం కొత్తపేట వద్దకు చేరేసరికి కృష్ణ బైక్‌ను వెనుక నుంచి బొలెరో వాహనంతో ఢీకొట్టారు. తర్వాత నిందితులు వాహనం ఆపి కిందికి దిగి రోడ్డుపై పడిపోయిన కృష్ణ ముఖంపై ఇనుప రాడ్డుతో విచక్షణారహితంగా కొట్టి, చంపేశారు. అనంతరం వాహనాన్ని సంఘటనా స్థలంలోనే విడిచిపెట్టి పరారయ్యారు.

గ్రామంలో పోలీస్ పికెట్

కేసులో దర్యాప్తు ప్రారంభించిన రాజాం పోలీసులు ఈ హత్యకేసులో ప్రధాన పాత్ర పోషించిన మరడాన మోహనరావు (ఎ1), రెడ్డి రాము (ఎ2), మరడాన వెంకటనాయుడు (ఎ3), మరడాన రామస్వామి (ఎ4)లను 24 గంటల వ్యవధిలోనే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు డీఎస్పీ, సీఐల ఆధ్వర్యంలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాస చక్రవర్తి, రాజాం సీఐ రవికుమార్, చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు, సీసీఎస్ సీఐ బుచ్చిరాజు, ఎస్పీ సీఐలు జి.రాంబాబు, ఈ.నరసింహమూర్తి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రునయనాలతో మాస్టారి అంత్యక్రియలు



తెర్లాం: గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ అంత్యక్రియలు అశ్రునయనాలతో ఆదివారం జరిగాయి. రాజాం నుంచి మోటార్ సైకిల్‌పై తెర్లాం మండలం కాలంరాజుపేట యూపీ స్కూల్‌కు వెళ్తున్న కృష్ణ మాస్టారును రాజాం మండలం కొత్తపేట వద్ద బొలెరో వాహనంతో ఢీకొని అదే గ్రామానికి చెందిన కొంతమంది హత్య చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం వేలాదిగా తరలివచ్చిన బంధువులు, అభిమానుల అశ్రునయనాల మధ్య కృష్ణ మాస్టారి అంతిమయాత్ర కొనసాగింది. మాస్టార్ అమర్ రహే అంటూ నినాదాలు హోరెత్తాయి. ఆయనను కడసారి చూసేందుకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అభిమానులతో గ్రామం కిటకిటలాడింది.

గ్రామంలో విషాదఛాయలు

కృష్ణ మాస్టారు హత్యకు గురికావడంతో గ్రామంలో రెండు రోజులుగా విషాదఛాయలు అలముకున్నాయి. గతంలో రెండుసార్లు సర్పంచ్‌గా పనిచేసి, ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా ఉన్న ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు మరిలేరన్న వార్త విని గ్రామస్తులు భోరున విలపిస్తున్నారు. గ్రామానికి చెందిన దేవుడు కృష్ణ మాస్టారని, ఆయనలేని లోటు ఎవరు తీరుస్తారని గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. మాస్టారి కుటుంబసభ్యులను పలువురు పరామర్శించి ఓదార్చారు.



తెర్లాం: అంతిమయాత్రలో పాల్గొన్న వేలాది మంది ప్రజలు, అభిమానులు

టెలి మెడిసిన్ సేవలు భళా..!

• వీడియో కాల్‌లో వ్యాధి చెబితే చికిత్స
• 2021 ఫిబ్రవరిలో సేవలు ప్రారంభం



కోట మండలం సీతంపేట హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నుంచి టెలిమెడిసిన్ హబ్‌కు వృద్ధుడి సమస్య వివరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ



వీడియోకాల్‌లో రోగి సమస్య తెలుసుకుంటున్న వైద్యులు

2021 ఫిబ్రవరి నుంచి 2023 జూన్ వరకు అందించిన సేవలు	
సంవత్సరం	వీడియో కాల్ సేవలు
2021	1,40,208
2022	1,11,887
2023 జూన్‌నాటికి	22,685

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రికి రాకుండానే రోగి ఉన్న గ్రామం నుంచే స్పెషలిస్టు వైద్యుల సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన టెలిమెడిసిన్ హబ్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. నిత్యం అధిక సంఖ్యలో రోగులు టెలిమెడిసిన్ హబ్ సేవలు పొందుతున్నారు. ఉన్న గ్రామం నుంచే స్పెషలిస్టు వైద్య సేవలు లభిస్తుండడంతో అధిక సంఖ్యలో రోగులు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఘోషా ఆస్పత్రి ఆవరణలో టెలిమెడిసిన్ హబ్‌ను ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో ఏర్పాటు చేసి రోజుకు వందలాది మందికి సేవలు అందిస్తోంది.

స్పెషలిస్టు వైద్యుల విధి నిర్వహణ

టెలి మెడిసిన్ హబ్‌లో ఐదుగురు స్పెషలిస్ట్ వైద్యులు విధులు నిర్వర్తిస్తారు. వారిలో పిల్లల వైద్యుడు, గైనకాలజిస్టు, జనరల్ ఫిజీషియన్, ఎంబీబీఎస్ వైద్యులు ఇద్దరు విధులు ఉంటారు. టెలిహబ్‌లో రోగులు ఏ స్పెషాలిటీ వైద్య సేవలు కావాలని అడుగుతారో సంబంధిత వైద్యులు స్పందించి వారికి సమస్య తెలుసుకుని ఏ చికిత్స అందించాలో ఆన్‌లైన్‌లో తెలియజేస్తారు. దాని ఆధారంగా వైద్య సిబ్బందికి రోగులకు చికిత్స అందిస్తారు.

విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నుంచి వీడియో కాల్

విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే రోగులను అక్కడ ఉన్న ఎంఎల్ హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) ముందుగా పరీక్షిస్తుంది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు ఎంఎల్‌పీలు వైద్య సేవలు అందిస్తారు. స్పెషలిస్టు వైద్యులైన గైనిక్, జనరల్ ఫిజీషియన్, పిడియాట్రిక్ వైద్య సేవలు అవసరమైతే విలేజ్ హెల్త్ సెంటర్ నుంచి టెలిమెడిసిన్ హబ్‌కు వీడియో కాల్ చేస్తారు. రోగి తన సమస్యను వైద్యులకు చెబితే ఏం మందులు వాడాలో ఎంఎల్‌పీకి స్పెషలిస్టు వైద్యులు తెలియజేస్తారు. అదేవిధంగా పీహెచ్‌సీ, పట్టణ పీహెచ్‌సీ నుంచి కూడా టెలి మెడిసిన్ హబ్‌కు వీడియో కాల్ చేసి స్పెషలిస్టు వైద్యుల సేవలు పొందుతారు. టెలి మెడిసిన్ హబ్ ఏర్పాటైన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో తప్ప మిగతా సమస్యలకు టెలి మెడిసిన్ ద్వారా సేవలు పొందగలుగుతున్నారు. ఈసేవలు గ్రామీణ ప్రాంత రోగులతో పాటు, పట్టణ ప్రాంత రోగులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఉన్న చోట నుంచే సేవలు

టెలిమెడిసన్ హబ్‌కు మంచి స్పందన వస్తోంది. అనేక మంది ఈసేవలను వినియోగించుకుంటున్నారు. రోగులు ఉన్న ప్రాంతం నుంచే వైద్య సేవలు పొందగలుగుతున్నారు.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

సీతంపేటలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న పర్యాటకులు



జెయింట్ వీల్ పై ఊగుతున్న యువత

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. అడ్వెంచర్ పార్కులో ఉన్న జలవిహార్‌లో బోటు షికారుతో పాటు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచారు. అలాగే జెయింట్‌వీల్, బంజీట్రంపోలిన్, క్లైంబింగ్ వాల్ పై ఎక్కి ఆనందించారు.

పల్లెలో 'ప్రత్యేక' వైద్యం

• పీహెచ్‌సీల్లో దంత,కంటి, ఈఎన్‌టీ వైద్య సేవలు



రామభద్రపురం సచివాలయం-2లో వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారిణి ఏఎల్‌జీ శిరీష



చొక్కాపు వీధిలో కంటి పరీక్షలు చేస్తున్న కంటి వైద్యాధికారి మూర్తి

రామభద్రపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీల)లో ప్రత్యేక వైద్యం అందుబాటులోకి వచ్చింది. చెవి, ముక్కు, గొంతు, దంత, కంటి సమస్యలతోపాటు మానసిక రుగ్మతలకు సైతం వైద్యం అందుతోంది.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో పీహెచ్‌సీల్లో కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించేవారు. తాజాగా సాధారణ జబ్బులతో పాటు స్పెషలిస్టుల వైద్యసేవలు సైతం గ్రామాల్లో అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. దంత, కంటి, మానసిక ఈఎన్‌టీ వైద్యులను ఎంపిక చేసి స్పెషలిస్ట్ వైద్యసేవలు పీహెచ్‌సీల్లో నిర్ణీత రోజుల్లో అందించేలా చర్యలు చేపట్టారు. వారానికి ఒకసారి దంత, ఈఎన్‌టీ వైద్యులు, నెలకు ఒకసారి మానసిక వైద్యులు ఆయా పీహెచ్‌సీలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అవరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తునారు. అలాగే కంటి వైద్యులు నిత్యం గ్రామాలలోని ప్రజలు, పాఠశాలల్లోని పిల్లలకు కంటిపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులతో పాటు కళ్లద్దాలు ఇస్తున్నారు. అలాగే ఎదిగిన బాలికలకు వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు గాను అడాలిస్కెంట్ క్లినిక్‌లను పీహెచ్‌సీల్లో నిర్వహిస్తున్నారు.

గ్రామస్థాయిలోనే దంత వైద్యం..

గ్రామ స్థాయిలోనే అన్ని రకాల వైద్యసేవలందిస్తూ రాష్ట్రప్రభుత్వం ప్రజలకు వ్యయ ప్రయాసలను తగ్గిస్తోంది.ఇందులో భాగంగా దంత వైద్యులు వారానికి ఒక సారి ప్రతి పీహెచ్‌సీని సందర్శిస్తూ అక్కడే డెంటల్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు.చిన్నపాటి దంత సమస్యలకు పీహెచ్‌సీలోనే చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరం ఉంటే దగ్గరలోని సీహెచ్‌సీ.ఏరియా,జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

పేద ప్రజలకు ప్రత్యేక వైద్యం

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గడిచిన నాలుగేళ్లలో వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చింది.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ స్పెషలిస్ట్‌లతో వైద్యం అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోనే పేదలకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది. వారంలో ఎంపిక చేసిన మూడు రోజుల్లో ఆయా స్పెషలిస్టులు పీహెచ్‌సీకి వెళ్లి వైద్యం అందిస్తారు.

– భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ, విజయనగరం

ముగిసిన పవర్‌లిఫ్టింగ్ పోటీలు

• విజేతలకు బహుమతుల ప్రదానం



క్లాసిక్‌పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొన్న మహిళలు



అన్ని విభాగాల విజేలతో నిర్వాహకులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: గడిచిన ఐదు రోజులుగా స్థానిక జీఎంఆర్ స్పోర్ట్స్ అరేనాలో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్స్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 22 రాష్ట్రాల నుంచి పాల్గొన్న సుమారు 300 మంది స్త్రీ, పురుషులు బరువు, వయసు ఆధారంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఇండియా పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజయం సాధించాలనే తపనతోనే పోటీలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. గెలుపోటములు సహజమని, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారని తెలిపారు. ఇక్కడ జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచిన వారంతా భవిష్యత్తులో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, ట్రోఫీలను పవర్ లిఫ్టింగ్ ఇండియా అధ్యక్షుడితోపాటు కార్యదర్శి పీజే జోసెఫ్, డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఏపీ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, సౌతిండియా జోనల్ సెక్రటరీ కోటేశ్వరరావు, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, డాక్టర శశికుమార్ తదితరులు అందించారు.

ఓవరాల్ చాంపియన్‌గా మహారాష్ట్ర..

ఐదు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల రెండు విభాగాల్లో ఓవరాల్‌చాంపియన్‌గా మహారాష్ట్ర నిలిచిందని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఎక్విప్డ్ విభాగంలో 244 పాయింట్లతోను, క్లాసిక్ విభాగంలో 287 పాయింట్లతో ముందంజలో నిలిచి ఈ ఘనత సాధించిందని చెప్పారు. మధ్యప్రదేశ్ 153 పాయింట్లతో ద్వితీయస్థానం, తమిళనాడు 152 పాయింట్లతో తృతీయస్థానం సాధించాయని వెల్లడించారు.

ఆఖరి రోజు విజేతలు వీరే..

ఆఖరి రోజు నిర్వహించిన క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగాయి. 40, 50, 60, 70 సంవత్సరాల విభాగంలో టీం చాంపియన్‌షిప్, బెస్ట్ లిఫ్టర్స్, ఓవరాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు.

టీం ఛాంపియన్‌షిప్‌లో..

40 సంవత్సరాలకు సంబంధించి టీంచాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, స్త్రీల విభాగంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. 50 సంవత్సరాల పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, స్త్రీల విభాగంలో మహారాష్ట్ర, కేరళ, అస్సాంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. అలాగే 60 సంవత్సరాల పురుషుల విభాగంలో తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, స్త్రీల విభాగంలో మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరప్రదేశ్‌లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి. 70 సంవత్సరాల పురుషుల విభాగంలో మహారాష్ట్ర, కేరళ, తెలంగాణలు నిలిచాయి.

బెస్ట్ లిఫ్టర్స్ విభాగంలో..

40 సంవత్సరాల పురుషుల విభాగంలో పి.మయకృష్ణ (తమిళనాడు), వెంకటేష్ ప్రభు (కర్నాటక), అంకుష్‌గద్వే (మహారాష్ట్ర), స్త్రీల విభాగంలో డాక్టర్ శార్వారి ఇనమ్దార్ (మహారాష్ట్ర), నీతామెహతా (మహారాష్ట్ర), ఏక్తా విష్ణునోయ్ (ఢిల్లీ)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 50 సంవత్సరాల పురుషుల విభాగంలో బినోద్‌కుమార్ పత్రా (జార్ఖండ్), గంటా వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రదేశ్), కృష్ణచంద్రసాహు (ఒడిశా)లు, స్త్రీల విభాగంలో వినుతారఘునాథ్ (మహారాష్ట్ర), రుబీదాస్ (మహారాష్ట్ర), రంజిత మిశ్రా(మహారాష్ట్ర)లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే 60 సంవత్సరాల పురుషుల విభాగంలో ఎస్.జయరామన్ (తమిళనాడు), కె.విజయరంగన్ (తమిళనాడు), కాంతీలాల్ ధకలే (మహారాష్ట్ర)లు, స్త్రీల బిద్యపుకాన్ (అస్సాం), మీరా రజ్దాన్ (మధ్యప్రదేశ్), నమ్రతాగౌతమ్ (ఉత్తరప్రదేశ్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 70 సంవత్సరాల పురుషుల విభాగంలో పి.ప్రేమ్‌చంద్రన్ (కేరళ), దేవ్‌దత్ బోర్ (మహారాష్ట్ర), అశోక్‌దాస్ (పశ్చిమబెంగాల్)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000-00
బంగారం(22సి. 10గ్రా.)	55,000-00
వెండి (కిలో)	81,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210